క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు

మహబూబ్‌నగర్ క్రైం: ఈనెల 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో డ్రగ్స్ నివారణలో పోలీస్ పాత్ర–విద్యార్థుల డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండగలరు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జానకి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి పీజీ చదువుతున్న విద్యార్థుల వరకు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, పోటీలు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ వ్యాసాలను ఈనెల 28వరకు సమర్పించాలని దీంట్లో ముగ్గురు విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థి వివరాలతో పాటు 500పదాలకు మించకుండా వ్యాసం రాసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

మూడో సంతానం నిబంధన ఎత్తివేయాలి

జడ్చర్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడో సంతానం ఉంటే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు అన్న నిబంధనను ఎత్తివేయాలని కోరుతు సోమవారం పలువురు నాయకులు జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అసెంబ్లీ సమావేశాలలో దీనిపై మాట్లాడి నిబంధనను తొలగించేలా కృషి చేయాలని కోరారు. ఏపీలో ఈ నిబందనను తొలగించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో జలంధర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యార్థినికి సాయం



పాలమూరు: నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ అడ్మిషన్ పొంది ఫీజు చెల్లించడానికి ఇబ్బంది పడుతున్న మండలంలోని మాచన్‌పల్లితండాకు చెందిన కడావత్ రాజేశ్వరికి సోమవారం రవిచిన్నపిల్లల ఆస్పత్రి యజమాని శేఖర్ రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. తల్లిదండ్రులతోపాటు వైద్యవిద్యార్థిని రాజేశ్వరికి ఆస్పత్రిలో చెక్కును ఇచ్చారు. ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు కావాల్సిన పుస్తకాలు, ఇతర సహాయం అందజేస్తానని డాక్టర్ వెల్లడించారు.

దోనూర్‌లో వైద్యశిబిరం

మిడ్జిల్: మండలంలోని దోనూర్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. ఈ శిబిరంలో ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. ప్రజలు సిజనల్ వ్యాధులబారిన పడకుండా ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది డాక్టర్ శశాంక్, చెన్నమ్మ, అయూబ్‌ఖాన్, దేవయ్య, నరేశ్, శ్రీదేవి, శోభరాణి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ

మహమ్మదాబాద్: స్థానిక ఎన్నికల కోసం తయారు చేసిన ఓటరు లిస్టులను అధికారులు మరోమారు సరిచేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల బీఎల్‌ఓలు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉండి అన్ని గ్రామాల ఓటరు లిస్టులను సరి చేస్తున్నారు. 2002 ఎన్నికల్లో ఉన్న ఓటరు లిస్టులో ఉన్న నంబరును 2025లో ఉన్న ఓటరు లిస్టుకు జత చేయాలి. దీంతో రెండు ప్రాంతాల్లో వేరువేరు గ్రామాల్లో ఉన్న పేరు తొలగించే అవకాశం ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడడంతో ప్రభుత్వం ఓటరు లిస్టును సరిజేసే పనిలో పడిపోయింది. ఆయా గ్రామాల బీఎల్‌ఓలు, కార్యదర్శులు బిజీబిజీగా ఉన్నారు. ఓటరు లిస్టు సవరణలను రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

శబరిమలకు పాదయాత్ర

నవాబుపేట: అయ్యప్ప మాలధారులు సోమవారం మండల కేంద్రంలోని శివాలయంలో ఇరుముడి ధరించిన స్వాములు పాదయాత్రగా శబరికి బయలుదేరారు. వీరిని మండల ప్రజలు పెద్ద ఎత్తున పూజలు చేసి సాగనంపారు. దాదాపుగా 40 రోజులు సాగే మహా పాదయాత్రలో మండల కేంద్రానికి చెందిన భానుప్రకాశ్, కొండాపూర్‌కు చెందిన అనిల్‌కుమార్ ఉన్నారు. మండల అయ్యప్పా సేవా సమితి సుదర్శన్, రాము, బ్రహ్మం, రవి, మణికంఠ, మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, నర్సింహగౌడ్‌కు ఘనంగా సన్మానించి సాగనంపారు.

రోడ్డు మరమ్మతు

మహమ్మదాబాద్: మారుమూల గిరిజన తండా వెళ్లాలంటే ఎంతో దూరం. అలాంటి తండాకు రోడ్డుసౌకర్యం కూడా లేదు. ఉన్నకాస్త రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతలకు గురై గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. అలాంటి సమయంలో అదే తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎస్టీసెల్ శ్రీనునాయక్ సోమవారం తన సొంత నిధులను కేటాయించి జేసీబీ ఏర్పాటు చేసి కోతకు గురైన రోడ్డును గుంతలు లేకుండా వాహనాలు వెళ్లేందుకు తయారు చేశాడు. సంగాయపల్లి తండాకు వాహనాలు వెళ్లేందుకు తాత్కాలికంగా రోడ్డును మరమ్మతు చేయడంతో ఆయా గ్రామాల నాయకులు యువకులు అభినందిస్తున్నారు.



జడ్చర్లను అభివృద్ధి చేస్తాం



వరద కాల్వల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- రూ.14 కోట్ల వరద కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన

జడ్చర్ల: జడ్చర్ల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో గతంలో అనేకమంది రియల్ వ్యాపారులు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండానే వెంచర్లు చేసి అధికారులకు ఆమ్యామ్యాలు అందజేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. సోమవారం జడ్చర్ల మున్సిపాలిటీలో రూ.14కోట్లతో చేపట్టనున్న వరద కాల్వల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం వరద కాల్వల నిర్మాణం, సమస్యల పరిష్కారంపై సంబంధిత ఇంజినీరింగ్ డీఈఈ విజయ భాస్కర్‌రెడ్డి పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డీటీసీపీ నిబంధనల మేరకు వెంచర్లలో డ్రైనేజీ, బీటీరోడ్లు, మొక్కల పెంపకం, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా.. వెంచర్ల యజమానులు అవేమీ చేయకుండా ప్లాట్లు అమ్మేసుకుని, గత పాలకుల సహకారంతో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండానే మార్టిగేజ్‌ను రిలీజ్ చేసుకుని చేతులు దులుపుకొని వెళ్లారన్నారు. ఆయా ప్లాట్లను కొనుగోలు చేసిన తర్వాత కనీస సదుపాయాలను ప్రభుత్వ నిధులతో తాము చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి 16వెంచర్లకు నోటీసులు కూడా మున్సిపల్ అధికారులు ఇచ్చారని గుర్తు చేశారు. ఇలాంటి రియాల్టర్లను ప్రజలే నిలదీయాలని పిలుపునిచ్చారు. కావేరమ్మపేట, బాదేపల్లిలో పలు ప్రాంతాలు వర్షాలు వస్తేచాలు మునిగిపోయే పరిస్థితిని చూశానని.. ఆయా సమస్యల పరిష్కారం కోసం రూ.14కోట్లను మంజూరు చేశామన్నారు. మరో రూ.3.5కోట్లు మంజూరుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా రూ.5కోట్లతో పాతబజార్ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలకు రూ.12.5కోట్లు కూడా మంజూరయ్యాయన్నారు. మరో రూ.70 కోట్లతో జడ్చర్లను అన్నివిధాల అభివృద్ధి చేస్తామన్నారు. ఇక జడ్చర్ల చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మిస్తామని ఇందుకు కేంద్రం నుంచి డీపీఆర్ తయారీకి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని తెలిపారు. జడ్చర్ల ప్రాంతంలో 100 ఎకరాల్లో ప్రైవేట్ డెయిరీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, దీంతో ఎంతోమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, కమిషనర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థి

మిడ్జిల్ మండలం నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థినిని రంగంలోకి దింపుతామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. వల్లభురావుపల్లికి చెందిన మాజీ సర్పంచ్ నాగమ్మకు అవకాశం ఇచ్చే విధంగా కృషిచేస్తామన్నారు. ఆమె రెండుసార్లు సర్పంచ్‌గా, ఒకసారి ఎంపీటీసీగా చేసిన అనుభవం ఉందని, బీసీలకు తాము ప్రాధాన్యం ఇస్తామన్నారు. అదేవిధంగా డీసీసీ పదవిని కూడా బీసీలకు ఇచ్చేవిదంగా కృషిచేస్తామన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గర్భిణులకు లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ చేసే ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. లింగనిర్ధారణ చేసిన చో మొదటిసారి రూ.10వేల జరిమానాతోపాటు మూడు సంవత్సరాల జైలుశిక్ష, రెండోసారి 5సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.50వేల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రతి ఆస్పత్రిలో అందుకు సంబంధించిన రికార్డులు, రిపోర్డులను సరైన విధంగా అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో యథావిధిగా లింగ నిర్ధారణకు సంబంధించి బోర్డు పెట్టాలన్నారు. అబార్షన్లకు సంబంధించిన వివరాలు విధిగా రికార్డులో నమోదు చేయాలన్నారు. ప్రతి ఆస్పత్రిలో సర్వీసు చార్జీల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంపై నిర్లక్ష్యం వహిస్తే ఆ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పద్మజా, డీఈఎంఓ మంజుల, ఐఎంఏ అధ్యక్షుడు రామ్మోహన్, డాక్టర్లు శ్యామెల్, నరేశ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి



వీసీలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఇతర అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ధాన్యం కొనుగోలు కోసం జిల్లా యంత్రాంగం అన్నిరకాల చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్‌రవీంద్ర అన్నారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి వీసీ నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తగిన సదుపాయాలు, ధాన్యం సేకరణకు అవసరమైన పరికరాలు కూడా పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు ఏజెన్సీలు వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసే వివిధ శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ధాన్యం కొనుగోలులో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో 2025–26 వానకాలం ధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో ఈనెల చివరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చూసేలా ఏజెన్సీకు సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, డీఎం రవినాయక్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్, డీఆర్‌డీఓ నర్సిములు, జిల్లా సహకార అధికారి శంకరాచారి, మార్కెటింగ్ అధికారి బాలమణి, లీగల్ మెట్రాలజీ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

నగర కమిషనర్ హామీతో దీక్ష విరమణ



దీక్ష విరమింపజేయిస్తున్న నగర కమిషనర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: న్యూ మోతీనగర్‌లోని ఆర్‌యూబీ వద్ద రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, కాలనీ సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హామీ ఇవ్వడంతో స్థానికులు సోమవారం దీక్షలను విరమించారు. గాండ్లోనిచెరువు నిండి ఆర్‌యూబీ ద్వారా వరదతోపాటు మురుగు ఏరులై పారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని న్యూ మోతీనగర్ వాసులు ఈనెల 11 నుంచి దీక్షలకు పూనుకున్నారు. చివరకు కమిషనర్ స్పందించి తాజాగా శిబిరం వద్దకు వెళ్లి వారితో మాట్లాడి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామనడంతో విరమించారు. అనంతరం విలేకరులతో న్యూ మోతీనగర్ రోడ్డు సాధన సమితి అధ్యక్షుడు కాశపోగు ప్రసాద్ మాట్లాడుతూ 30రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించకపోతే మళ్లీ దీక్షలకు పూనుకుంటామన్నారు. అలాగే ఈ దీక్షలకు సహకరించిన స్థానికులు, మద్దతు నిచ్చిన ఆయా పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పైపులైన్ మరమ్మతు పరిశీలన

ధర్మాపూర్ శివారులో కొనసాగుతున్న మిషన్ భగీరథ పథకం పైపులైన్ మరమ్మతు పనులను సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈ నర్సింహ, డీఈఈ విజయ్ కుమార్, ఏఈలు వసంత, రాగవినతి, నుస్రత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆలకు జూబ్లీహిల్స్ ప్రచార బాధ్యతలు



తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి జూబ్లీహిల్స్‌లో జరిగే ఉపఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి తరపున రహమత్‌నగర్ డివిజన్‌లో ప్రచారం చేసే బాధ్యతలు అప్పగించారు. నెల రోజులపాటు ఆయన దేవరకద్ర నియోజకవర్గ పార్టీ క్యాడర్‌తోపాటు ప్రచారంలో పాల్గొంటారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆలకు రహమత్‌నగర్ డివిజన్ ప్రచారానికి సంబంధించిన జాబితాను అందజేశారు.

హర్యానా డీజీపీపై చర్యలు తీసుకోవాలి

గండేడ్: హర్యానా రాష్ట్రంలో ఐపీఎస్ అధికారిగా పని చేస్తున్న పూరన్‌కుమార్ ఆత్మహత్యకు కారణమైన ఆ రాష్ట్ర డీజీపీపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పాలమూరు అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పగిడ్యాల కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గండేడ్ మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పూరన్‌కుమార్‌ను కులవివక్షతో అవమానంచడంతో మానిసిక క్షోభకు గురై తన సర్వీస్ రివాల్వర్‌తో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. పూరణ్‌కుమార్ మృతికి కారణమైన హర్యానా డీజీపీతోపాటు ఇతర అధికారులను సర్వీస్ నుంచి తొలగించి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కప్లాపూర్ మాజీ ఎంపీటీసీ ఆశన్న, గండేడ్ మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.



గండేడ్ మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎదిర గ్రామ సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలోని 4వ వార్డు పరిధిలో ఉన్న ఎదిరలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని ఎదిర గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి వెళ్లే రోడ్డుమార్గం మొత్తం వర్షపు నీళ్లు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. కాల్వల నీళ్లు కూడా రోడ్లపై పారడంతో అపరిశుభ్రంగా మారి స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. అండర్ డ్రైనేజీతోపాటు అండర్‌పాస్ రోడ్డు మంజూరైనా ఇప్పటివరకు పనులు ముందుకుపడడం లేదని ఆరోపించారు. పెండింగ్ పనులను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాలకిష్టయ్య, విఠల్‌జీ, సూరిబాబు, రమేశ్, మణ్యం, భాను, గోపాల్, లక్ష్మన్, అమృత, మంగమ్మ, లక్ష్మి, శ్రీరామ్, బాలయ్య, వెంకట్‌స్వామి, తుల్జారాము పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నిరసన

మహబూబ్‌నగర్ రూరల్: సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బిక్షపతి, రాష్ట్ర కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ దళితులు ఉన్నతస్థానాల్లో కూర్చోవడం కొంతమందికి గిట్టడం లేదన్నారు. అందుకే చీఫ్ జస్టిస్‌పై దాడికి తెగబడుతున్నారని, ఇది కేవలం చీఫ్ జస్టిస్‌పై దాడి మాత్రమే కాదని, దేశ న్యాయవ్యవస్థపై ప్రజాస్వామిక స్ఫూర్తిపై అన్నిటికన్నా ప్రధానంగా రాజ్యాంగంపై ఈ దాడి జరిగిందన్నారు. దాడిని సీరియస్‌గా తీసుకొని నిందితులపై కఠినమైన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో బాలరాజు, కమలాకర్, నరేందర్, శ్రీరాములు, రమేశ్, యాదయ్య, కొండయ్య, రాజు, నాగరాజు, శ్రీనివాస్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అధికారులకు అవగాహన

దేవరకద్ర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బందికి సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్డియో పల్మనరీ రెసుసిటేషన్ (సీపీఆర్) అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గుండె పోటు అనేది ఎవరికైనా ఎప్పుడైనా రావచ్చని ప్రథమ చికిత్స కింద సీపీఆర్ చేయడం వల్ల గుండెపోటుకు గురైన వ్యక్తి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని వైద్యాధికారి శరత్‌చంద్ర తెలిపారు. సీపీఆర్ చేసే విధానంపై అందరికీ అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తెచ్చిన బొమ్మకు సీపీఆర్ ఎలా చేయాలో చూపించారు. అలాగే అందిరితో చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ దీపిక, ఎంపీఓ బలరాం, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ శ్రీనివాసరావుతో సీపీఆర్ చేయిస్తున్న వైద్యాధికారి శరత్‌చంద్ర

మెనూ పాటించకుంటే చర్యలు తప్పవు

నవాబుపేట: హాస్టల్‌లో విద్యార్థులకు అందించే భోజనం విషయంలో మెనూ పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం కలెక్టర్ మండల పర్యటన చేసిన సందర్భంలో యన్మన్‌గండ్ల బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా మెనూ విషయంలో నిర్లక్ష్యం చేసిన వార్డెన్‌కు సస్పెన్షన్ ఆడర్లు జార్టీ చేశారని వివరించారు. అందుకే వార్డెన్లు మెనూ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేజీబీవీలో సైతం భోజనం విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు.

నోవెల్‌టెక్ ఫీడ్ కంపెనీ ఎదుట కార్మికుల ధర్నా



భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ సమీపంలో ఉన్న నోవెల్‌టెక్ ఫీడ్ కంపెనీ (కోళ్ల దానా) ఎదుట సోమవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. కంపెనీ యాజమాన్యం కంపెనీ మూసివేస్తున్నామని, రాజీనామా చేస్తే వేతనాలపై గ్రాట్యూటీ చెల్లిస్తామని సంతకాలు చేయించుకున్నారని, సంతకాలు చేసుకున్న తర్వాత బేసిక్ పే పై గ్రాట్యూటీ చెల్లించారని కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు ఆరోపించారు. తాము 40మంది కార్మికులం పదేళ్లుగా నోవెల్‌టెక్ ఫీడ్ కంపెనీ కార్మికులుగా పనిచేస్తున్నామని తమకు కంపెనీ యజమాన్యం నమ్మించి మోసం చేసిందని కార్మికులు ఆరోపించారు. తమకు న్యాయం చేయకపోతే కంపెనీ ఎదుట దర్నా కొనసాగిస్తామని కంపెనీ కార్మికులు యాజమాన్యాన్ని హెచ్చరించారు.

వైర్‌లెస్ స్పీకర్ అందజేత

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి పాఠశాలకు వెలుగొమ్ముల గ్రామానికి చెందిన నారా యణగుప్తా జ్ఞాపకార్థం ఆయన కుటుంబ స భ్యులు వైర్‌లెస్ రీచార్జబుల్ స్పీకర్‌ను బహూకరించారు. రూ.20వేల విలువగల స్పీకర్, మౌత్‌పీస్, సౌండ్‌సిస్టం అందజేశారు. కార్యక్రమంలో గుప్తా కుటుంబ సభ్యులు మహేశ్, రాఘవేందర్, నర్సమ్మ, తులసి, కల్యాణి, మోహన్‌బాబు, హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాంరెడ్డి గూడెం ఎస్సీ గురుకులంలో చనిపోయిన విద్యార్థిని ప్రియాంక మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిగిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో చదువుకునేందుకు వాతావరణం బాగాలేదని, చెప్పి ఆత్మహత్య చేసుకుందని, ప్రిన్సిపాల్ మాత్రం అమ్మాయి హాస్టల్‌లో ఉండేందుకు ఇబ్బంది పడిందని చెబుతున్నారని, పొంతనలేని సమాధానాలు వస్తున్న నేపథ్యంలో దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు.

ముమ్మరంగా జాతర పనులు



చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయం వద్ద అధికారులు పనులను ముమ్మరం చేశారు. ఇప్పటికే ఆలయ పరిసరాల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్ర పరిచారు. స్వామివారి ప్రధాన ఆలయం, మెట్లు, రాజగోపురం, కోనేరు తదితర వాటికి రంగులు అద్దుతున్నారు. సోమవారం జాతర మైదానంలో జేసీబీతో డ్రైనేజీ పనులు చేపట్టారు. త్వరలోనే పనులు పూర్తి చేయనున్నట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



కొనుగోలు చేస్తున్న ప్రజలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో కళా సిల్క్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. వివిధ రాష్ట్రాల చేనేత కళాకారులు అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణలోని గద్వాల్, నారాయణపేట, పోచంపల్లి, ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాంలోని మూగ, ఎరిసిల్క్స్, బీహార్‌లోని బాగల్పూర శిల్క్స్, టస్సర్, చత్తీస్‌ఘడ్‌లోని ట్రిబిల్ వర్క్స్, కోసా సిల్క్, గుజరాత్‌లోని బాందని, కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్, శారీస్, జమ్మూ కాశ్మీర్‌లోని ఎంబ్రాయిడరీ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, పాస్మిక్ శాల్, కర్నాటకలోని క్రేప్, ప్రింటెండ్ శారీస్, మధ్యప్రదేశ్‌లోని చందేరి, మహేశ్వరి, రాజస్థాన్‌లోని కోటా, బందాని, బ్లాక్ ప్రింట్, సంగ్నరి ప్రింట్, ఉత్తరప్రదేశ్‌లోని జమ్దాని, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్‌తోపాటు హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నోవి కుర్తిస్, జోర్ కర్టెన్స్ తదితర రాష్ట్రాల హ్యాండీ క్రాఫ్ట్స్, న్యూట్రిషన్ ఫుడ్ విక్రయిస్తున్నారు. పట్టణ ప్రజలు ప్రదర్శనను వినియోగించుకొని చేనేత కళాకారులకు చేయూత అందించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

పొలాలకు బాట ఏర్పాటు చేయాలి

దేవరకద్ర: రైతులు పొలాలకు వెళ్లడానికి అనువుగా బాటను ఏర్పాటు చేయాలని సోమవారం కౌకుంట్ల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కౌకుంట్ల గ్రామఖంతం నుంచి ఆశన్న పొలం వరకు అలాగే రేకులంపల్లి శివారు వరకు బాటను ఏర్పాటు చేయాలని కోరుతూ.. రైతుకూలీ సంఘం నాయకులు సాంబశివుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారంలోగా సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్, తహసీల్దార్ సుందర్ రాజ్, ఏఓ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలో..

దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణికి వివిధ గ్రామాల ప్రజలు ఫిర్యాదులు అందజేశారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ దీపిక, ఎంఈఓ బలరాం, వైద్యాధికారి శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భూమికి 'పసుపు' రంగేసినట్లు



నవాబుపేట: భూమికి పసుపు రంగేసినట్లు.. ఎక్కడ చూసిన పసుపు మయం కనిపిస్తుంది. మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో మొక్కజొన్న పంట భారీగా రావడంతో యార్డు మొత్తం పసుపు మయంగా మారింది. భూమికి పసుపు రంగేసినట్లు చందంగా మార్కెట్ కనువిందు చేసింది. సోమవారం దాదాపుగా 2349 బస్తాల మొక్కజొన్న ఆరబోసినట్లు తెలుస్తుంది.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు నిధులు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు ఇవ్వాలని కోరుతూ ఎంఎస్‌ఎఫ్ నాయకులు కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి సందర్భంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొంతకాలంలో పేద విద్యార్థులు చదువుతున్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలకు నిధులు ఇవ్వకపోడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కమలాకర్, నాగేందర్, రాజశేకర్, అర్జున్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి రిమాండ్

జడ్చర్ల: హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాలానగర్ ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు. మండలంలోని సింగమ్మగడ్డ తండాకు చెందిన సభావత్ బాలును హత్య చేసేందుకు యత్నించిన కేసులో మొదటి ముద్దాయిగా ఉన్న సేవాలాల్ శ్రీనును సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడి నుంచి రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుంటకు గండిపడి వృథాగా పోతున్న నీరు



నవాబుపేట: మండలంలోని కూచూర్ గ్రామంలో ఉన్న బోలేమోని కుంటకు గండి పడి నీరంతా వృథాగా పోతోంది. మూడు రోజుల క్రితం భారీగా కురిసిన వానలతో కుంటనిండి అలు గు పారింది. తాజాగా కుంటకు గండి పడి నీ రంతా పంట పొలాల చెంత వృథా పోతుండటంతో ఆదివారం గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే గండి పూడ్చి నీటిని నిలువరించటంతో పాటు వృథా నీరంత పంటపొలాలను ముంచెత్త కుండా అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ

దేవరకద్ర: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ విధానానికి వ్యతిరేకంగా ఏఐసీసీ పిలుపు మేరకు సోమవారం మండలంలోని నార్లోనికుంట్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో సంతకాల సేకరించారు. కాంగ్రెస్ నాయకులు రామాంజనేయులు, రాఘవులు, గౌస్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంతకాల సేకరణ

అడ్డాకుల: మూసాపేట మండలంలోని మహ్మదుస్సేన్‌పల్లి, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామా ల్లో గ్రామస్తులతో సంతకాల సేకరణ చేశారు. మహ్మదుస్సేన్‌పల్లిలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్నయాదవ్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ పెద్ద ఎత్తున ఓట్ల చోరీకి పాల్పడి మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కార్యక్రమాల్లో బాలరాజు, సతీశ్‌కుమార్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, కురుమూర్తి, కిష్టారెడ్డి ఉన్నారు.



మహ్మదుస్సేన్‌పల్లి గ్రామంలో సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు